

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** మధ్యాహ్న భోజన కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు చిరంజీవి డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా విద్యాధికారి కార్యాలయంలోని సూపరిండెంట్ శ్రీనివాస్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 24 సంవత్సరాల క్రితం పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించిన రోజు నుండి వంటలు చేయడానికి ఎవరూ రాని రోజులలో ధైర్యం చేసి వంట కార్మికులుగా పనిచేస్తూ సొంత డబ్బులతో వంటపాత్రలు, గ్యాసు, వంట సరుకులు కొనుగోలు చేసి నాటి నుండి వంటలు చేస్తూ వంట బిల్లులు వచ్చినప్పుడే తీసుకుంటూ, ఆదాయం వచ్చినా రాకపోయినా జీవిస్తున్నరన్నారు. గ్రామాలలో చిన్నాచితకా కారణాలతో , డ్వాక్రా గ్రూపుల పేరుతోనే కార్మికులను తొలగించడానికి ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. న్యాయ-ంమైన కోరికలను పరిష్కరించి రాష్ట్రంలో ఉన్న 54,201 వంట కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.

## యువత భక్తి మార్గంలో నడవాలి



**ఉద్యమ కెరటం, వాంకిడి :** యువత భక్తి మార్గంలో నడవాలని వాంకిడి తాజా మాజీ సర్పంచ్ బండే తుకారాం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శివ కేశవ నగర్, ఇందిరా నగర్, పోచమ్మ బస్తి గణేష్ మండపాలలో మహా అన్నదాన వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాంకిడి తాజా మాజీ సర్పంచ్ బండి తుకారాం పాల్గొని, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలు వదిలి, భక్తి మార్గంలో నడుచుకోవాలని, యువకులు సేవా కార్యక్రమాలలో పాల్గొని, సేవ చేయాలని ఆయన అన్నారు. తధానంతరం మండల కేంద్రంలోని భక్తులు అన్న ప్రసాద్ దాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి గణేష్ మండలి సభ్యులు, శివకేశవ నగర్ గణేష్ మండలి సభ్యులు, పోచమ్మ బస్తీ సభ్యులు , తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ టీచర్ మాకొద్దు

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ ( ముస్తఫా) :** విధులకు సరిగా రాకుండా పౌష్టికాహారం సక్రమంగా అందించని అంగన్వాడీ టీచర్ మాకు వద్దు అంటూ బుధవారం వాంకిడి మండలంలోని చిన్న బెండార గ్రామ ప్రజలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ పౌష్టికాహారం సరిగా అందించడం లేదని, ఏ ఒక్క రోజు కూడా అంగన్వాడీ కేంద్రానికి రావడం లేదని ఆరోపించారు. 3 నెలల నుంచి చిన్న పిల్లలకు గుడ్లు, పౌష్టికాహారం అందించడం లేదని, ఆమె అంగన్వాడీ టీచర్ గా ఉన్నంత వరకు ఆ కేంద్రానికి తమ పిల్లలను పంపమని గ్రామస్తులు స్పష్టం చేశారు.

## బాధిత కుటుంబానికి సాయం



**ఉద్యమ కెరటం, పెంచికల్పేట్:** పెంచికల్పేట్ మండలంలోని ఎర్రగుంట గ్రామానికి చెందిన ఎర్మ వినోద ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానిక నాయకులు బుధవారం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ ఆదేశాల మేరకు కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ రూ. 5వేల ఆర్థిక సహాయం అందజేశారు. దండే విఠల్ అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ జెడ్పీటీసీ సభ్యులు సరిత రాజన్న, మాజీ సర్పంచ్ దాసరి చంద్రమౌళి, గ్రామ పెద్దలు గంగారాం, పొట్టే మహేష్, తిరుపతి, గావిడే వెంకటేష్, బుచ్చన్నతదితరులు పాల్గొన్నారు.

## గణనాథుడికి బోరంచు పూజలు

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** వినాయక నవరాత్రులను పురస్కరించుకొని ఆదిలాబాద్ పట్టణంలోని ప్రెస్ క్లబ్ ఆవరణలో ప్రతిష్టించిన గణనాథుడిని బుధవారం తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి దర్శించుకున్నారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాల నడుమ వినాయకుడికి ప్రత్యేక పూజలు జరిపారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆనందంగా జీవించాలని వేడుకున్నారు. అనంతరం మండప నిర్వాహకులు ఆయనను శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట మావల మాజీ వైస్ ఎంపీపీ అట్ల గోవర్ధన్ రెడ్డి, గణేష్ మండప నిర్వాహకులు సుధాకర్, అభిలాష్ తదితరులు ఉన్నారు.








# కార్మికులా? కట్టుబానిసలా?

## జేకే పేపర్ మిల్స్‌కు పట్టని కార్మికుల భద్రత

### పరిశ్రమలో ప్రమాదాలు జరిగినా సమాచారం రాదు
### లేబర్‌సేఫ్టీ రూల్స్ పాటించదు • ఎన్నికలు నిర్వహించదు?
### కాలుష్య నివారణ పట్టదు!

> కాగజ్‌నగర్‌లోని జేకే పేపర్ మిల్స్‌వింత పోకడలకు వెళ్తోంది.. కార్మికుల భద్రతను పట్టించుకోకుండా వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్నది. కార్మికుల విజ్ఞప్తులు, ఆందోళనలు బేఖాతరు చేస్తున్నది. పరిశ్రమలో నిర్వహించాల్సిన కార్మిక సంఘ ఎన్నికలను సైతం నిర్వహించకుండా యాజమాన్యం తాత్సారం చేస్తున్నది. అడిగేవారు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నది. కార్మికుల బలహీనతను ఆసరాగా చేసుకొని కార్మిక చట్టాలను సైతం తుంగలో తొక్కుతున్నది.

**ఉద్యమ కెరటం, ప్రత్యేక ప్రతినిధి :**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలో ఉన్నటువంటి కాగితపు పరిశ్రమలో ప్రతినిత్యం ప్రమాదాలు జరుగుతున్న, యాజమాన్యం సమాచారం బయటకు పొక్కనివ్వరు. అంత రహస్యంగానే పనులు కొనసాగిస్తున్నారు. కార్మికులు తీవ్రంగా గాయపడిన సందర్భాల్లో సైతం ప్రమాదం జరిగిన విషయాన్ని అత్యంత గోప్యంగా ఉంచుతున్నారు. కాగజ్ నగర్ పట్టణంలో గతంలో సిర్పూర్ పేపర్ మిల్స్ పేరిట కొనసాగినది. ఎన్నో సంవత్సరాల పాటు కొనసాగిన ఈ పరిశ్రమ నష్టాల బారిన పడడంతో అప్పటి యాజమాన్యం కాగితపు పరిశ్రమను లే ఆఫ్ ప్రకటించింది. దానితో అందులో పరిశ్రమలు పనిచేస్తున్న కార్మికులు సిబ్బంది రోడ్డున పడ్డారు. జీవనోపాధిని కోల్పోయినారు. దీంతో చాలామంది కార్మికులు, సిబ్బంది జీవనోపాధి కోసం ఇతర పట్టణాలకు, రాష్ట్రాలకు తరలిపోయారు. ఈ నేపథ్యంలో కార్మికులు, స్థానికులు అభ్యర్థన మేరకు అప్పటి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఏ విధంగానైనా ఈ పరిశ్రమను తెరిపించాలని విశ్వప్రయత్నలు చేసి, జే కే పేపర్ మిల్స్ యాజమాన్యానికి వారు డిమాండ్ చేసిన విధంగా, యాజమాన్యానికి రాయితీలు ఇచ్చి పేపర్ మిల్లును ప్రారంభించారు. అన్ని రకాల రాయితీలు పొందిన జే. కే. పేపర్ మిల్స్ యాజమాన్యం, అందులో పని చేస్తున్న చాలామంది కార్మికులను తొలగించింది. అయినప్పటికీ నీ పేపర్ మిల్లు కొనసాగాలన్న ఏకైక ఎజెండాతో వారు ఏ విధంగా వ్యవహరిస్తున్న చూసి చూడనట్లుగా ఉంటున్నారు. కాగా జే కే పేపర్ మిల్లు యాజమాన్యం అన్ని రకాల కార్మిక చట్టాలను, నియమ నిబంధనలను తుంగలో తొక్కుతూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. యాజమాన్యం చేతులు మారగానే ప్రారంభంలోనే కాగజ్నగర్ పట్టణంలోని అంతర్గత రోడ్లను మూసివేశారు. దీనిపై స్థానికుల నుండి తీవ్ర వ్యతిరేకత రావడంతో వెనక్కి తగ్గారు. అంతేకాకుండా స్థానికేతరులకు ఉద్యోగ అవకాశాలు ఇస్తున్నారు, కానీ స్థానికులకు ఉపాధి కల్పించడం లేదని దీనిపై స్థానికుల నుండి పలుమార్లు విజ్ఞప్తులు , ఆందోళనలు చేసిన యాజమాన్యం బెఖాతర్ చేస్తున్నారు. అంతేకాకుండా పరిశ్రమలో రక్షణ, భద్రత ప్రమాణాలు పాటించకపోవడంతో ప్రతినిత్యం ఏదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉన్నది. ప్రమాదాలు జరిగి కార్మికులు తీవ్రంగా గాయపడితే వారిని కాగజ్నగర్ నుండి ఇతర ప్రాంతాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయాలను అత్యంత రహస్యంగా ఉంచుతున్నారు. గోప్యంగా ఉంచుతూ ప్రమాదాలు జరిగిన విషయాన్ని బహిర్గతం కాకుండా కార్మికులను బెదిరింపులకు దిగుతున్నారు. బుధవారం రోజున పేపర్ మిల్లులో కాంట్రాక్ట్ కార్మికుడు భాస్కర్, ఫైబర్ ఆప్టిక్ పనులు నిర్వహిస్తున్నప్పుడు కార్మికుడి పై రసాయనాలు మీద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ విషయాన్ని రహస్యంగా ఉంచారు. చికిత్స కోసం అతనిని హైదరాబాద్ కు తరలించారు. అదేవిధంగా గత నెలలో పరిశ్రమలు పనిచేస్తున్న చోటనే ఇద్దరు కార్మికులు ప్రమాదానికి గురి అయ్యారు. ఇలా ప్రతినిత్యం పరిశ్రమలో ప్రమాదాలు జరుగుతున్న యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. భద్రత ప్రమాణాలు, అవసరమైన రక్షణ వ్యవస్థలు లేకుండానే కార్మికులు పరిశ్రమలో పనిచేస్తున్నారు. గతంలో ఇదే పరిశ్రమలో పవర్ ప్లాంట్ నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో జరిగిన ప్రమాదంలో 8 మంది కార్మికులు మృత్యువాత పడ్డారని సమాచారం. మరికొంతమంది కార్మికులు తీవ్రంగా గాయపడినట్లు తెలుస్తుంది. పరిశ్రమలో నిర్వహించాల్సిన కార్మిక సంఘ ఎన్నికలను సైతం నిర్వహించకుండా యాజమాన్యం తాత్సారం చేస్తున్నది. ఇదే విషయమై కార్మిక సంఘ నాయకులు స్థానిక రాజకీయ నాయకులు లేబర్ కమిషనర్ను కలిసి ఫిర్యాదు చేశారు. అయినప్పటికిని నేటి వరకు ఎన్నికలు నిర్వహించకపోవడం గమనార్హం. జే కే పేపర్ మిల్లు యాజమాన్యం పరిశ్రమను ఎక్కడ మూసివేస్తుందో నన్న విషయాన్ని కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నది. వీరి బలహీనతను ఆసరాగా చేసుకొని కార్మిక చట్టాలను సైతం తుంగలో తొక్కుతున్నది.



## మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు
# తోడ్పాటు అందించాలి

జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా తోడ్పాటు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో ఇందిరా మహిళ శక్తి పథకం క్రింద ఆసిఫాబాద్ మండలం బూర్గుడ గ్రామానికి చెందిన స్వయం సహాయక సంఘం సభ్యురాలు కుందారపు రాణికి 10 లక్షల రూపాయలతో మంజూరైన మొబైల్ చేపల విక్రయ వాహనం యూనిట్ ను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి తో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా అనేక వ్యాపారాలు చేసేందుకు ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అందిస్తున్న రుణ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. బూర్గుడ గ్రామానికి చెందిన స్వయం సహాయక సంఘం సభ్యురాలు 4 లక్షల రూపాయల సొంత నిధులు, 6 లక్షల రూపాయల ప్రభుత్వ రాయితీ నిధులతో సంచార చేపల విక్రయ వాహనం నిర్వహించేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందని, మహిళలు వ్యాపారాలు నిర్వహించి ఆర్థిక స్వావలంబన పొందడమే కాకుండా కుటుంబ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా మత్స్యశాఖ అధికారి సాంబశివరావు, డిస్టిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్లు యశోద, యాదగిరి సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ అభివృద్ధి కలలను వేగవంతం చేయాలి

● జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే




**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** జిల్లాలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ఉపాధి హామీ పథకం ఎ. పి. ఓ.లు, సెర్ప్ ఎ. పి. ఎం.లు, హౌసింగ్ ఇంజనీరింగ్ అధికారులతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, లబ్ధిదారులకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణ సదుపాయం, వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటడం, పారిశుద్ధ్య పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, 100 శాతం ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలని తెలిపారు. బేస్ మెంట్ నిర్మాణం ఆలస్యం చేసే వారిని గుర్తించి బ్యాంకు లింకేజీ, మండల సమాఖ్య ద్వారా ఇండ్ల నిర్మాణం ప్రారంభించని వారికి లక్ష రూపాయలు రుణము అందించే విధంగా చర్యలు తీసుకోవాలని, విడతల వారీగా లబ్ధిదారుల పాత్రలో నిధులు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రధానమంత్రి జన్ మన్ పథకం క్రింద పి.వి.టి.జి లకు 100 శాతం ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని, అర్హులైన లబ్ధిదారుల జాబితా అందించాలని తెలిపారు. పనుల జాతర కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీ కార్యాలయ భవనాలు, అంగన్వాడి కేంద్రాల భవనాలు, పశువుల షెడ్లు, పౌల్ట్రీ షెడ్, గోట్ షెడ్ల నిర్మాణం చేపట్టాలని, ఇంకుడు గుంతల నిర్మాణం చేయాలని తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వలన రహదారులపై ఏర్పడిన గుంతలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని, గ్రామాలలో పారిశుద్ధ్య పనులు నిరంతరం నిర్వహించాలని తెలిపారు. గుంతలలో వర్షపు నీరు నిలువకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని, దోమల వృద్ధిని అరికట్టే విధంగా ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ పౌడర్ పిచికారి చేయాలని తెలిపారు. ఆయిల్ పామ్ పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించి సాగు విస్తీర్ణం పెంపొందించే విధంగా ప్రోత్సహించాలని తెలిపారు. వనమహోత్సవం 2025 కార్యక్రమంలో భాగంగా జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, హౌసింగ్ పి. డి. తదితరులు పాల్గొన్నారు.

# పంటలు నష్టపోయిన రైతులు ఆందోళన చెందొద్దు

కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల్ చారి



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల్ చారి అన్నారు. బుధవారం బోథ్ నియోజకవర్గంలోని తలమడుగు మండలం కజ్జర్ల, రుయ్యాడి గ్రామాల్లో వర్షాలతో దెబ్బతిన్న పంట పొలాలను కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్, మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా బోథ్ నియోజకవర్గంలో జరిగిన నష్టాన్ని, ప్రస్తుత పరిస్థితులను ఆడే గజేందర్ కేంద్ర మాజీ మంత్రికి తెలిపారు. దాదాపుగా 4704 రైతులు 7వేల 484 ఎకరాల పంట నష్టపోయినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులు ఎవరు ఆందోళన చెందొద్దని, నష్టపోయిన రైతులను కలిసి వారి పంట పొలాలను పరిశీలించి ధైర్యం చెప్పారు. క్షేత్రస్థాయిలో పర్యటించి వ్యవసాయ అధికారులు పక్కగా నష్టపోయిన రైతుల వివరాలు నమోదు చేయాలని సూచించారు. వరదలతో దెబ్బతిన్న రోడ్లను పరిశీలించి సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరగా మరమ్మతులు చేసే విధంగా చూస్తానని తెలిపారు. ఆయన వెంట అధికారులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు ఉన్నారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పట్ల సంబరాలు



**ఉద్యమ కెరటం, తాండూర్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల పరిమితి నిబంధనలు ఎత్తివేస్తూ అసెంబ్లీలో చట్ట సవరణ చేసి బిల్లును ప్రవేశపెట్టి బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం పట్ల తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. బుధవారం తాండూర్ మండల కేంద్రంలోని ఐబీలో బాణసంచాలు పేల్చారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండి ఈసా, మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డిలు మాట్లాడుతూ ఎన్నికల హామీలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించి హామీని నెరవేర్చిందన్నారు. బీసీలకు 42శాతం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లను కల్పించడం చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్ మహేందర్ రావు, గట్టు మురళీధర్ రావు, నాయకులు సాలిగామ బానయ్య, ఎస్ శంకర్, సూరం దామోదర్ రెడ్డి, పెట్టం విష్ణు కళ్యాణ్, షేక్ మోమిన్ అలీ, రహెమత్ ఖాన్, పుట్ట శ్రీనివాస్, షేక్ అయ్యుబ్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సాగుకు అనుగుణంగా యూరియా పంపిణీ చేయాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జిల్లాలో కొనసాగుతున్న వ్యవసాయ సాగుకు అనుగుణంగా సకాలంలో యూరియా, ఎరువులు కార్యాచరణ ప్రకారం పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భుక్యా ఛాత్రుతో కలిసి మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులతో యూరియా, ఎరువుల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యూరియా, ఎరువుల నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని తెలిపారు. వ్యవసాయ సాగుకు అనుగుణంగా సకాలంలో కార్యాచరణ ప్రకారం రైతులకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, ఫర్టిలైజర్ దుకాణాల్లో యూరియా, ఎరువుల నిల్వలు పరిశీలించి దుకాణ యజమానులు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ-పాస్ మిషన్లలో నమోదు చేయబడిన వివరాలు, సంబంధిత ఫర్టిలైజర్ దుకాణాల్లో నిల్వ ఉన్న ఎరువుల వివరాల్లో ఎలాంటి తేడా ఉండకుండా చూసుకోవాలన్నారు. యూరియా పక్కదారి పట్టకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ఫర్టిలైజర్ దుకాణాల నుంచి అధిక మొత్తంలో కొనుగోలు చేసే వారి వివరాలు పరిశీలించాలని, కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రశీదు అందించి వివరాలను రిజిస్టర్ లో నమోదు చేయాలని ఆదేశించారు. ఫర్టిలైజర్ దుకాణంలో ధరల వివరాలు, నిల్వ ఉన్న ఎరువుల వివరాలు ప్రదర్శించాలని తెలిపారు. పంట సాగు చేస్తున్న రైతులు, సాగు చేయని రైతుల వివరాలు సేకరించి నివేదిక అందించాలని తెలిపారు. కాలానికి అనుగుణంగా సాగు చేయాల్సిన పంటల వివరాలు, సాగు మెళుకువలపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. పంట సాగు విస్తీర్ణం, యూరియా, ఎరువుల పంపిణీ తదితర అన్ని అంశాలు అనుసంధానమై ఉంటాయని, నివేదిక స్పష్టంగా ఉన్నట్లయితే వరి ధాన్యం, పత్తి, ఇతర పంటల దిగుబడి, కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా చేసేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో ప్రవీణ్ అన్నారు. బుధవారం మండల అభివృద్ధి కార్యాలయంలో గ్రామపంచాయతీ, ఉపాధిహామీ, ఇతర శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పురోగతి, ఉపాధి హామీ పనులు, సీజనల్ వ్యాధుల నివారణ కోసం తీసుకోవాల్సిన చర్యలు, గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి అంశాలపై అధికారులతో చర్చించారు. ప్రతి గ్రామ పంచాయతీలో బ్లీచింగ్ పౌడర్, ఫాగింగ్, నీరు నిల్వలువ ఉండకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లను త్వరగా పూర్తి చేసేలా చూడాలన్నారు. ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్నందునా శిథిలావస్థలో ఇండ్లలో ఉంటున్నవారిని గుర్తించి వారిని పునరవాసం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఏపీఓ రాజన్న, ఈసి రజనీకాంత్, టెక్నికల్ అసిస్టెంట్లు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# వర్షంలో ఎరువులు వేయద్దు



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** ఈనెల 6వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించిందని మండల వ్యవసాయ అధికారి బానోత్ నాగరాజు తెలిపారు. వర్షాలు వస్తున్న క్రమంలో రైతులు ఎరువులు, పురుగు మందులు వేయవద్దని సూచించారు. వర్షాలు కురుస్తున్నప్పుడు వర్షపు నీటిలో నత్రజని శాతం ఎక్కువగా ఉంటుందని, యూరియా ఒక వారం వేయకపోయిన పంటలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలిపారు. ఓ వైపు వర్షం పడుతుండగా యూరియా, ఇతర మందులు చల్లడంతో ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతారని అన్నారు. ఈ విషయాన్ని మండల రైతులు గమనించాలని, వర్షాలు కురుస్తున్నప్పుడు పంటలపై పిచికారి మందులు, యూరియా లాంటివి చల్లకుండా ఉండటమే శ్రేష్టమని అన్నారు. పంటలకు ఎలాంటి చీడలు వచ్చినా వ్యవసాయ విస్తీర్ణ అధికారుల సలహా, సూచనల మేరకు తగిన మోతాదులో మాత్రమే మందులను వాడాలని పేర్కొన్నారు. వీలైనంతగా సేంద్రియ ఎరువులను వాడాలన్నారు. రసాయన ఎరువుల ద్వారా భూసారం తగ్గడమే కాకుండా ఇతర కొత్త వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంటుందని వివరించారు.

# గోల్కొండలో వైద్య శిబిరం



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** మండలంలోని గోల్కొండ వీధిలో వైద్య శిబిరం నిర్వహించినట్లు హెచ్ఈఓ వెంకన్న తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలతో బెజ్జూర్ గ్రామపంచాయతీలోని గోల్కొండతో పాటు మన్నెవాడ, ఇతర కాలనీలో వైద్య సిబ్బందితో కలిసి ఉచిత మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వైరల్ వ్యాధులతో ఇబ్బంది పడుతున్న వారికి మాత్రలు అందించడం జరిగిందని, అవసరం ఉన్నవారి నుంచి రక్త నమూనాలు సేకరించామని తెలిపారు. వీటిని పరీక్షించిన తర్వాత మందులు అందించడం జరుగుతుందన్నారు. వర్షాకాలం ప్రజలు పరిశుభ్రంగా ఉండాలని, వేడి పదార్థాలను తీసుకోవాలన్నారు. నీటిని కాచి చల్లార్చిన తర్వాత తాగాలని సూచించారు. చిన్న సమస్య వచ్చినా ఆశా కార్యకర్తకు సమాచారం అందించి స్థానిక ఆసుపత్రిలో వైద్యులతో చికిత్స నిర్వహించుకోవాలని పేర్కన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సొంత వైద్యం చేసుకోవడం, మెడికల్ షాపులు, ఆర్ఎంపీలపై విశ్వాసం ఉంచి వైద్యం చేయించుకోవడం చేయకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మీసారి వైకుంఠం, ఏఎన్ఎం సుస్మిత, మేఘన, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# డిజిటల్ అరెస్టుల పేరుతో అప్రమత్తంగా ఉండాలి



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** డిజిటల్ అరెస్టుల పేరుతో ప్రస్తుత సమాజంలో జరుగుతున్న నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ డీఎస్పీ హసీబుల్లా సూచించారు. సైబర్ జాగృతి దివస్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల, లారీ ఓనర్స్ అసోసియేషన్ లో వేర్వేరుగా అవగాహన సదస్సులు నిర్వహించారు. ఆర్టీఏ ఈ చలాన్ ఫ్రాడ్స్, ఫేక్ ప్రొఫైల్ స్కాం, కస్టమర్ సర్వీసెస్, డిజిటల్ అరెస్టపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో సైబర్ జాగృతి దివస్ కార్యక్రమం ద్వారా ప్రజలను సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించడం జరుగుతుందని అన్నారు. డిజిటల్ అరెస్ట పేరుతో ప్రస్తుత సమాజంలో జరిగే నేరాలపై పూర్తి అవగాహన కల్పించి చైతన్న పర్చడం జరుగుతుందని పేర్కొన్నారు. నేరాలు జరిగే పద్ధతిని వివరించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జే సంగీత, లారీ ఓనర్స్ ప్రెసిడెంట్ జైసింగ్, సైబర్ క్రైమ్ సిబ్బంది బి సురేందర్, సంతోష్, అహద్ తదితరులు పాల్గొన్నారు.



## పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** వర్షాకాలం దృష్ట్యా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బెజ్జూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి మీసారి వైకుంఠం తెలిపారు. బుధవారం గ్రామ పంచాయతీలోని పలు వీధుల్లో ఆరోగ్య సిబ్బందితో కలిసి పర్యటించారు. ఇండ్లల్లో నిల్వ ఉన్న నీటిని, చెత్తను తొలగింపజేశారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వర్షపు నీరు నిల్వ ఉన్నచోట ఆయిల్ బాల్స్ వేయడం జరిగిందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో గ్రామపంచాయతీ పరిశుభ్రత పై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందని తెలిపారు. డ్రైనేజీలు పరిశుభ్రంగా ఉండేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గ్రామపంచాయతీని స్వచ్ఛతగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది హెచ్టిఓ వెంకన్న, ఏఎన్ఎం మేఘన, సుస్మిత, ఆశా కార్యకర్తలు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## యూరియా కోసం పడిగాపులు



**ఉద్యమ కెరటం, తాండూర్:** మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు రైతుల పంటలకు యూరియా అవసరం ఎక్కువైంది. యూరియా కొరతతో రైతులు యూరియా కోసం పడిగాపులు కాసే పరిస్థితి ఏర్పడింది. తాండూర్ మండలం రేచిని గ్రామంలో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో పంపిణీ చేసే కేంద్రం వద్ద సిబ్బంది రాక కోసం రైతులు వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంది. రైతులు చెప్పులను వరుస క్రమంలో ఉంచే పరిస్థితి నెలకొంది. పట్టా పుస్తకాలు కలిగిన రైతుకు రెండు బస్తాల యూరియా మాత్రమే ఇవ్వడంతో ఆ యూరియా ఎటు సరిపోకపోవడంతో నాన ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు సరిపడా యూరియా సరఫరా చేసి యూరియా కొరతను తీర్చాలని మండల రైతులు కోరుతున్నారు.

## బోరు మోటర్లు మంజూరు



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** మండల కేంద్రంలో బుధవారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని 2వ వార్డు, సీతారాంబజార్ బ్రాహ్మణ వీధిలో జెడ్పీ నిధులతో రూ. 4లక్షల 50వేలతో మూడు బోర్లు వేయించారు. వార్డు ప్రజలు మంచి నీళ్లతో చాలా ఇబ్బందులు పడుతున్నామని మండల కాంగ్రెస్ అధ్యక్షుని దృష్టికి తీసుకెళ్లాగా వెంటనే స్పందించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ జెడ్పీ నిధులతో ప్రజల దాహార్తిని తీర్చేందుకు బోర్ మోటర్లు వేయించారు. అడిగిన వెంటనే బోర్లు వేయించడంతో కాలనీవాసులు హమీద్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అక్కపల్లి బాలయ్య, లింగంపల్లి పరశురాములు గౌడ్, మాడుగుల మల్లయ్య, నాగరాజ్ గౌడ్, దేశెట్టి రాజశేఖర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## లబ్దిదారులకు చెక్కుల పంపిణీ



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** మండల కేంద్రంలోని గాయత్రి ఫంక్షన్ హాల్ లో బుధవారం తహశీల్దార్ మారుతి రెడ్డి ఆధ్వర్యంలో లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి 94 మందికి, సీఎం రిలీఫ్ ఫండ్ 56 మందికి మొత్తం రూ. 1కోటి 96లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ కొమ్మిరి శెట్టి విజయ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం, రేషన్ కార్డుల, సన్నబియ్యం పథకాలు విజయవంతం అయ్యాయని తెలిపారు. చెక్కులు మంజూరుకు కృషిచేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డిలకు ప్రత్యేకత కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతి, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘ ప్రతినిధి పర్శ హనుమాన్లు, డైరెక్టర్లు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జైపూర్ మండలం గంగిపల్లి గ్రామంలోని పల్లె దవాఖాన, ఆసుపత్రికి వెళ్లే రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పల్లె దవాఖానాకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఆసుపత్రిలో అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఆసుపత్రిలోని వార్డులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పాటించాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. రహదారి నుంచి ఆసుపత్రికి వచ్చే అటాచ్ రోడ్డు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మరమ్మత్తులు చేయాలని తెలిపారు. గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి. పనులు వేగవంతం చేసే విధంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. నిబంధనలకు లోబడి 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇంటిని నిర్మించుకునేలా లబ్ధిదారులకు వివరించాలని పేర్కొన్నారు. కుందారం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. రిజిస్టర్లు, మందుల నిల్వలు, వార్డులను పరిశీలించి వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి తరగతి గదులు, వంటశాల, హాజరు పట్టిక, మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని, ఆహారం తయారీలో తాజా కూరగాయలు, నిత్యావసర సరుకులను వినియోగించాలని, విద్యార్థులకు శుద్ధమైన తాగునీటిని అందించడంతో పాటు వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులతో మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని సాధించే దిశగా పట్టుదలతో కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వం విద్యారంగ బలోపేతం దిశగా అనేక చర్యలు చేపడుతుందని, అన్ని ప్రభుత్వ విద్య సంస్థలను అభివృద్ధి చేస్తూ నాణ్యమైన విద్యను అందిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి కేకే పరామర్శ



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గంభీరావుపేట మండలం నర్మల ఎగువ మానేర్ వరదల్లో కొట్టుకపోయిన పంపుకాడి నాగయ్య కుటుంబాన్ని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జీ కేకే మహేందర్ రెడ్డి బుధవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని తెలిపారు. అలాగే వారికి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా కేకే మహేందర్ రెడ్డి మాట్లాడుతూ వరదల్లో కొట్టుకుపోయిన నాగయ్య ఆచూకీ కోసం పోలీస్ ఎస్డీఆర్ఎఫ్, రెవెన్యూ బృందాలు వెతికిన దొరకకపోవడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎప్పటికప్పుడు వివరిస్తూ వారికి ప్రభుత్వం ద్వారా రూ. 5 లక్షలు కలెక్టర్ చేతుల మీదుగా అందించి వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించేలా చూస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఆ కుటుంబానికి అండగా ఉ ంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు, జిల్లా ఉపాధ్యక్షులు కొమిరిశెట్టి తిరుపతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు హమీద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మట నర్సయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు లచ్చయ్య, ఓరుగంటి నర్సింలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## పరమత సహనానికి కేరాఫ్ ఎస్సై సర్తాజ్ పాషా



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** పరమత సహనానికి చిరునామాగా బెజ్జూర్ ఎస్సై సర్తాజ్ పాషా నిలిచారు. బుధవారం మండలంలోని మర్తిడి గ్రామంలోని పలు గణేష్ మండపాలకు అన్నదాన సామాగ్రి అందించారు. బెజ్జూర్ గ్రామంలోని శ్రీ స్నేహ గణేష్ మండలి వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు.. బెజ్జూర్ మండలంలోని మర్తిడి, బెజ్జూర్ గ్రామాల్లోని పలు గణేష్ మండపాలను సందర్శించారు. సాయంత్రం బెజ్జూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో గల స్నేహ యువజన గణేష్ మండలి వద్ద అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో గణపయ్యను పూజించి నిమజ్జనం కూడా అంతే శ్రద్ధతో నిర్వహించుకోవాలన్నారు. ఇతరులను ఇబ్బంది కలిగించకుండా చూడాలని, డీజే శబ్దాలను చేయకుండా శాంతియుతంగా విఘ్నేశ్వరుడి ఊరేగింపు నిర్వహించుకోవాలని మండప నిర్వాహకులకు సూచించారు. అలాగే 24 గంటలు గణపయ్య మండపం వద్ద నిర్వాహకులు పర్యవేక్షణ ఉంచాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను సంప్రదించాలని పేర్కొన్నారు. నిమజ్జనం నిర్వహించే సందర్భంలో మహిళలు, చిన్నపిల్లలు వాగులు, చెరువుల వద్దకు వెళ్ళవద్దని తెలిపారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది, గణేష్ మండప నిర్వహకులు, గ్రామస్తులు ఉన్నారు.

## నిబంధనలు ఉల్లంఘించిన ఉపాధ్యాయుడు సస్పెండ్

**ఉద్యమ కెరటం, జైనూర్:** నిబంధనలు ఉల్లంఘించిన ఎస్జీటీ జె విలాస్ ను సస్పెండ్ చేయడం జరిగిందని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఆర్ రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని జైనూర్ మండలం సుకుద్ పల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న జె విలాస్ విధులకు మద్యం సేవించి హాజరయ్యారని గ్రామస్తులు చేసిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. ఎస్ సీఆర్పీ జైనూర్ సూచన ప్రకారం ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఆదేశాల మేరకు ప్రభుత్వ నియమ, నిబంధనల ప్రకారం సదరు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయడం జరిగిందని వివరించారు.

# డీజేలకు అనుమతులు లేవు




**ఉద్యమ కెరటం, తాండూర్:** డీజే సౌండ్ సిస్టంలకు అనుమతులు లేవని తాండూర్ ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు. తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురు, శుక్రవారాల్లో నిర్వహించే గణేష్ నిమజ్జన వేడుకల సందర్భంగా ఎవరైనా డీజే ఆపరేటర్లు గణేష్ నిమజ్జనం సందర్భంగా అద్దెకు ఇచ్చినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. శోభయాత్ర సందర్భంగా వాహనం నడిపే డ్రైవరు ఎలాంటి మత్తు పదార్థాలు సేవించరాదని, జాగ్రత్తగా వాహనాన్ని నడపాలని సూచించారు. విద్యుత్ తీగలను చూసుకుంటూ ముందుకు సాగాలన్నారు. చిన్నపిల్లలను వాహనంలో ఎక్కించకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. నిమజ్జన ప్రాంతానికి వారిని తీసుకెళ్ళవద్దని సూచించారు. శోభయాత్ర సందర్భంగా సాంప్రదాయ, సాంస్కృతిక పద్ధతిలో నృత్యాలు చేస్తూ వెళ్లాలని, డీజే బాక్సులు పెట్టరాదని తెలిపారు. నిమజ్జనం ముగిసేంతవరకు మండల ప్రజలు, నిర్వాహకులతో పాటు ప్రతిఒక్కరు శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి కోరారు.

## వినాయకుడికి 101 ప్రసాదలు



**ఉద్యమ కెరటం, తిర్యాణి:** గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తిర్యాణి మండల కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘ ఆధ్వర్యంలో మహిళలు ఆలయంలో కొలువుదీరిన బొజ్జ గణపయ్యకు బుధవారం 101 రకాల ప్రసాదాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం ఇలాంటి పూజలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తిర్యాణి మండల ఆర్య వైశ్య సంఘ పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# 'మాయం' వెనుక మత్'లబ్-డబ్బు'!?

## ఆసిఫాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో ఏం జరుగుతోంది.?

- వివాహిత అదృశ్యం వెనుక అంతుచిక్కని రహస్యాలు
- సాక్షాత్తు కలెక్టర్ సీసీ-సఖీ సెంటర్ సీఓ మధ్య బంధంపై అనుమానాలు
- తన భార్య 'మాయం' వెనుక కలెక్టర్ సీసీ రమణ ఉన్నాడని భర్త ఫిర్యాదు
- కలెక్టర్, ఎస్పీ 'మౌనం' వెనుక మతలబు ఏంటని మీడియాను ఆశ్రయించిన 'బాధిత-భర్త'
- పిల్లలను తన తల్లిగారింట్లో వదిలి వెళ్లిన భార్య మమత
- తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్‌ను ఆశ్రయించిన పిల్లలు
- 'కలెక్టర్ సీసీ'నే కారణమంటున్న భర్త
- లేదూ.. తన భర్త వేధింపుల వల్లే వెళ్లిపోయానంటూ భార్య వీడియో కలకలం
- అసలు కథ వేరంటూ గుప్పుమంటున్న ప్రచారం
- మాయమైన 'ఆ-ఇద్దరి' వద్ద రూ.50 లక్షలు కాదు.. 2 కోట్లు ఉన్నాయని వైరల్
- ఆ 'డబ్బు' వల్లే ఈ రాద్ధాంతమా?
- ఇంతకూ.. మరి 'ఆ-కోట్ల' డబ్బు ఎవరిది? అదృశ్యం వెనుక ఎవరున్నారు?
- 'ఆమె వీడియో'ను మీడియాకు ఫార్వార్డ్ చేసింది 'డీపీఆర్‌వో'నంట!
- కలెక్టర్ సీసీ పేరును 'ఎఫ్ఐఆర్'లో ఎందుకు నమోదు చేయలేదు?
- ఈ ఉదంతంలో కలెక్టర్, ఎస్పీ పాత్రేంటీ?
- రాష్ట్ర వ్యాప్తంగా కలకలం సృష్టిస్తోన్న 'వివాహిత అదృశ్యం' వెనుక కథ!

(ఉద్యమ కెరటం, డైనమిక్ బ్యూరో)

ఇదోక అనూహ్య ఘటన.! సమాజ చీడపురుగుల బాధితులను ఓదార్చి.. కంటికి రెప్పలా కాపాడాల్సిన 'సఖీ' సెంటర్ అధికారి.. సాక్షాత్తు కలెక్టర్ సీసీ మధ్య ఉన్న 'రహస్య-బంధం' వెనుక ఉన్న ఆసక్తికర కథ ప్రస్తుతం రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తోంది. ఆమె భర్త ఆరోపిస్తున్నట్టు 'ఆ-ఇద్దరి' మధ్య ఉన్నది నిజంగా 'వివాహేతర బంధమే'నా? లేక డీపీఆర్వో విడుదల చేసిన వీడియోలో ప్రత్యక్షమైన 'ఆమె' తన భర్త వేధింపుల వల్ల తాను వెళ్లిపోయానని, ఇక ఎప్పటికీ రానని కుండబద్దలు కొట్టినదాంట్లో వాస్తవమెంత? ఈ 'రెండు-వాదనలు' కాకుండా 'చిలువలు-పలువలు'గా చక్కర్లు కొడుతున్న మరో ముచ్చట ఏంటంటే.. 'మాయమైన' ఆ ఇద్దరి వద్ద తొలుత రూ.50 లక్షల నగదు ఉందని కొందరంటే? లేదు లేదు.. వారి వద్ద రూ.3.కోట్లకు పైగా నగదు ఉందటన్న ముచ్చట్లతో జనాలు చెవులు కొరుక్కుంటున్నారు. ఇందులో ఏది నిజం? ఏది అబద్ధం? ఏది ప్రచారం? ఇంతకూ 'ఆ-సొమ్ము' ఎవరిది? ఆ సొమ్మును వారి దగ్గర దాచి పెట్టింది ఎవరు? 'బాధిత భర్త' రెబ్బెన పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో కలెక్టర్ సీసీ కే రమణ పేరును ఎందుకు నమోదు చేయలేదు? పోలీసులు ఎందుకు నోరు మెదపటం లేదు? సాక్షాత్తు కలెక్టర్ సీసీపై ఇన్ని ఆరోపణలొచ్చినా? పోలీసులకు ఫిర్యాదు చేసినా జిల్లా కలెక్టర్ ఎందుకు స్పందించడం లేదు? 'పైఅధికారుల' డబ్బును 'రక్షించడం' కోసం 'ఆ-జంట' విడిపోవడం కరెక్టేనా? 'ఈ-జంట' అదృశ్యం వెనుక 'కోట్ల డబ్బే' కారణమా? లేక 'కుటుంబ కలహాలే' అయివుంటాయా? 'అతను-ఆమె-రహస్య మిత్రుడి' మధ్య అభం శుభం తెలియని పసిపిల్లలు 'మహిళా కమిషన్'ను ఆశ్రయించాల్సిన దుస్థితి ఎందుకు ఎదురైంది? అసలు ఏం జరుగుతోందని వారం రోజుల నుండి ఈ రాద్ధాంతం చర్చానీయాంశమైంది.

### కలకలం రేపిన కథ ఇదీ.!

ఆసిఫాబాద్ లోని గురుకుల పాఠశాలలో టీచర్‌గా పని చేసే రమేశ్- సఖి సెంటర్‌లో సీవోగా పని చేసే మమత దంపతులకు కూతురు(13), కొడుకు (7) ఉన్నారు. భార్యను ఏదైనా ఉన్నత స్థానంలో చూడాలని భర్త ఆమెను బాగా చదివించగా, రెండేండ్ల క్రితం సఖి సెంటర్‌లో సీవోగా చేరింది. వీరి జీవితం అన్యోన్యంగా సాగుతున్నది. ఈ నెల 24న బడుగ పండుగ సందర్భంగా భార్య, పిల్లలను అత్త గారి ఇల్లైన రెబ్బెనలో రమేశ్ విడిచిపెట్టి ఆసిఫా బాద్‌కు వచ్చేశాడు. మరుసటి రోజు తన అత్త రమేశ్‌కు ఫోన్‌చేసి, తన కూతురు కనబడటం లేదని అల్లుడికి చెప్పింది. ఆమె కోసం బంధువుల ఇండ్లు, తెలిసిన వారి ఇండ్లలో వెతికినా ఆచూకీ లభించక పోడంతో రమేశ్ 26న రెబ్బెన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు సమయంలో మౌఖికంగా పోలీసులకు పలు విషయాలు చెప్పినట్టు రమేశ్ పేర్కొన్నాడు.

### కలెక్టర్ సీసీ రమణనే తీసుకెళ్లాడు

జిల్లా కేంద్రంలోని సఖి సెంటర్ సీఓగా పని చేస్తున్న తన భార్యను కలెక్టర్ సీసీగా పని చేస్తున్న కే రమణనే తీసుకెళ్లాడని రమేశ్‌ఆరోపిస్తున్నాడు. ఈ మేరకు ఓ వీడియోను కూడా విడుదల చేశాడు. తాను రెబ్బెన పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే బేఖాతర్ చేసినట్లు వాపోయాడు. తన భార్య అదృశ్యంపై వివరాల పోలీసులను సంప్రదిస్తే, దాటవేస్తున్నారని వాపోయాడు. 'ఎఫ్ఐఆర్'లో రమణ 'నో-అక్యూస్డ్'గా పేర్కొనడం వెనుక తనకు అనుమానాలున్నాయని రమేష్ ఆ వీడియోలో పేర్కొంటున్నారు. సీసీ శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో కలెక్టరేట్ కు వచ్చి వెళ్లారని, కానీ మిస్సింగ్ ఉన్న తన భార్య గురించి..అక్కడి అధికారులు.. అడిగితే పొంతనలేని సమాధానాలేవో చెబుతున్నారని రమేష్ వాపోయాడు. తమకు ఇద్దరు చిన్న పిల్లలున్నారని, న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. లేనిపక్షంలో తనకు ఆత్మహత్యే శరణ్యమని చెప్పారు. పోలీసుల 'ఉదాసీనత' వెనుక తనకు అనుమానాలున్నాయని.. దీని వలన తనకు న్యాయం జరగదని కంటతడి పెట్టాడు. తన కుటుంబం ఛిన్నాభిన్నమైందని పేర్కొంటున్నాడు. పోలీసులకు సీసీ పేరు కె.రమణ అని చెప్పినా ఎఫ్ఐఆర్‌లో పెట్టకపోవడం దారుణమన్నాడు.

### కలెక్టర్, ఎస్పీకి వేడుకోలు

తన భార్యకు మాయ మాటలు చెప్పి తీసుకెళ్లిన కేసును పక్కదారి పట్టిస్తున్న వారిపై పూర్తి విచారణ చేపట్టి తనకు న్యాయం చేయాలని కలెక్టర్, ఎస్పీలని కోరినట్లు రమేశ్ తెలిపాడు. చట్ట వ్యతిరేక పనులు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తన భార్య అదృశ్యంపై సఖి సెంటర్ నిర్వాహకులు సైతం నిర్లక్ష్యం చేయడంపై ఆవేదన వ్యక్తం చేశాడు. కౌన్సెలింగ్‌నిర్వహించి కుటుంబాలను కలిపే సఖి సెంటర్ నిర్వాహకులు సైతం ఏమి జరగనట్లు వ్యవహరించడంపై ఏ అదృశ్య శక్తులు పనిచేస్తున్నాయో తెలుపాలని డిమాండ్ చేశారు. మహిళా అదృశ్యం కేసులో పోలీసులు ఈ విధంగా ప్రవర్తించడంపై ఉన్నతాధికారులు కలుగజేసుకొని కేసును పక్కదారి పట్టిస్తున్న వారిపై విచారణ జరపాలని కోరారు.

### రూ.2 కోట్లు ఎక్కడివి.. ఎవరివి?!

వివాహిత అదృశ్యం కేసులో మరో ట్విస్ట్ ఏంటంటే.. వీరు అదృశ్యమైన సమయంలో వారి వద్ద దాదాపు రూ.50 లక్షలు ఉన్నట్లు తొలుత ప్రచారం జరుగింది. కానీ, రోజులు గడిచే కొద్ది అవి రూ.50 లక్షలు కాదు.. రూ.3.కోట్లకు పైగా ఉంటాయని కలెక్టరేట్ లో చర్చించుకుంటున్నారు. కాగా, చిరు ఉద్యోగులుగా పనిచేస్తున్న వీరి వద్ద దాదాపు రూ.3 కోట్లు ఉండడం పట్ల పలు అనుమానాలకు తావిస్తున్నది. అయితే, ఆ మహిళా ఇంటి నుంచి వెళ్లేటప్పుడు ఓ పెద్ద బ్యాగు తీసుకెళ్లినట్టుగా చుట్టు పక్కల వారు గుసగుసలాడుకుంటున్నారు. ఈ డబ్బు ఓ ఉన్నతాధికారిదని, అందుకోసమే ఈ కేసును పక్కదారి పట్టిస్తున్నట్లు తెలుస్తుంది. అసలు ఈ రూ.3 కోట్లు ఎవరివై ఉంటాయని.. అని కలెక్టరేట్ కార్యాలయంలోని ఉద్యోగులు చెవులు కోరుకుంటున్నారు. మహిళను తీసుకెళ్లిన విషయంపై, మహిళా అదృశ్యం కేసు నమోదు చేసుకొని పోలీసులు చేతులు దులుపుకున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.



### వివాహిత అదృశ్యం కేసులో ఓ 'ట్విస్టు'.!


కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సఖి సెంటర్ అడ్మినిస్ట్రేటర్ గా పనిచేస్తున్న వివాహిత అదృశ్యం కేసు మరో మలుపు తిరిగింది. రెబ్బెన పోలీస్ స్టేషన్లో 26 వ తేదీన భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులకు శుక్రవారం రోజున సాయంత్రం ఆ మహిళ ఓ వీడియోను విడుదల చేసింది. అందులో తన భర్త, తన కుటుంబ సభ్యులు మానసికంగా, శారీరకంగా హింసించడంతో నేను ఓ స్నేహితుని ద్వారా ఆసుపత్రికి వెళ్లినట్లు ఆమె తెలిపారు. తన భర్త విడుదల చేసిన వీడియోలో పేర్కొన్న విధంగా తాను అదృశ్యం కాలేదని, తనను శారీరకంగా హింసించడంతో అనారోగ్యానికి గురైనందున తను స్నేహితుని సహాయం కోరడంతో అతను మానవత దృక్పథంతో తనకు సహాయం చేసినట్లు తెలిపారు. తన భర్త, కుటుంబ సభ్యులతో తనకు ప్రాణహాని ఉందని పేర్కొన్నది. కాగా 26 తేదీన నా భర్త, కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు తర్వాత తను రెబ్బెన పోలీస్ స్టేషన్ కు ఫోన్ చేసి తను ఎటు వెళ్లలేదని, తను అదృశ్యం కాలేదని సమాచారం ఇచ్చినట్లు వీడియోలో తెలిపింది. కానీ అదే రోజున పోలీసులు మహిళా అదృశ్యం కేసు నమోదు చేసిన విషయం ఆశ్చర్యానికి గురి చేస్తున్నది. తాను తిరిగి రానని, తిరిగి వచ్చేది లేదని స్పష్టం చేసింది. కాగా, భర్త రమేష్ చెబుతున్న విషయానికి ఆ వివాహిత చెబుతున్న విషయానికి పొంతన కుదరడం లేదని తెలుస్తుంది. ఉన్నత అధికారి వద్ద క్యాంపు క్లర్క్ గా పని చేస్తున్న వ్యక్తికి ఈ కేసులో నేరుగా సంబంధం ఉండడంతో పోలీసులు కేసును పక్కదారి పట్టిస్తున్నారని తెలుస్తున్నది. ఉన్నతాధికారి క్యాంపు క్లర్క్ ఈ వివాహితను మాయ మాటలు చెప్పి ఆమెను ట్రాప్ చేశాడని భర్త తెలుపుతుంటే, అందుకు విరుద్ధంగా ఆమె వీడియో విడుదల పలు అనుమానాలకు తావిస్తున్నది. ఇందులో భారీ మొత్తం లో డబ్బులు ఉండడం చిరు ఉద్యోగుల వద్ద ఇంత భారీ స్థాయిలో డబ్బు ఉన్నట్లు చాలా ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. అంతేకాకుండా తన భార్య అదృశ్యమైనప్పుడు చాలా పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకువెళ్లినట్లు భర్త ఆరోపిస్తున్నాడు. మహిళా అదృశ్యం కేసు ఇంకెన్ని మలుపులు తీసుకోనున్నదోనని సహా ఉద్యోగులు గుసగుసలాడుతున్నారు.



FIRST INFORMATION REPORT T.S.P.M. Orders 470,500
(Under section 173 and 176 BNSS)

1. District Kumurambheem Asifabad P.S. Rebbena Year 2025 FIR No. 255/2025 Date 26-08-2025
2. Acts & Section(s): Woman Missing
3. a) Occurrence of Offence: Day Monday Date & Time From 24-08-2025 10:00:00 Time Period 1
Date & Time To 25-08-2025 14:00:00 Prior To
b) Information Received at P.S.: Date & Time 26-08-2025 13:00:00
General Diary Reference: Entry No 14 Date & Time 26-08-2025 13:00:00
4. Type of Information: Written
5. Place of Occurrence:
a) Distance and Direction From P.S.: 1 Kms, North Beat No.
b) Address Place At Rebbena Area/Mandal Street/Village Rebbena
City/District KUMURAMBHEEM ASIFABAD State Telangana PIN
c) In case, outside the limit of this Police Station, then
Name of P.S. District
6. Complainant / Informant:
a) Name Thallapelli Ramesh
b) Father's /Husband's Name Ramalingu
c) Date/Year of Birth Age 42 Years
d) Nationality India e) Caste Netkani
f) Passport No Date of Issue Place of Issue
g) Occupation Teacher Mobile No. 9573885562
h) Address House No Area/Mandal Asifabad Street/Village
City/District KUMURAMBHEEM ASIFABAD State TELANGANA PIN
7. Details of known/suspected/unknown accused with full particulars:
Serial No: 1
a) Name No Accused
b) Father's /Husband's Name
c) Occupation

> ఇందులో ఎవరు కరెక్ట్? ఏది నిజం? ఈ మొత్తం ఉదంతంలో జరిగిందేంటీ? జరుగుతున్నదేంటీ? జరుగబోయేదేంటీ? ఇంత రాద్ధాంతం జరుగుతున్నా కలెక్టర్ ఎందుకు నోరు విప్పట్లేదు? ఇదే కలెక్టర్ జిల్లాలో ఏ శాఖ అధికారైనా.. ఇలా చేస్తే నిమిషాల మీద 'రియాక్ట్' అయ్యి చర్యలు చేపట్టే వారని, అలాంటి నిబద్ధత కలిగిన కలెక్టర్ తన కార్యాలయంలో పనిచేసే తన సహాయకుడు 'తప్పు చేస్తే' ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? అనే పలువురి అనుమానాలకు సమాధానం దొరకని ప్రశ్నలు? దొరికితే 'అసలు-దొంగలు' ఎవరు? ఈ ప్రశ్నకు బదులేది? ఈ వివాదానికి ఎవరు తెరదించుతారో కాలమే నిర్ణయించాలి!




### మహిళా కమిషన్ శరణుజొచ్చిన పిల్లలు

ఈ ఆసక్తికరమైన కథలో అనూహ్యంగా మరో 'ట్విస్ట్' ఎదురైంది. తండ్రి పోలీసుల చుట్టూ.. కలెక్టర్ ఆఫీస్ ల చుట్టూ తిరుగుతూ 'తమ తల్లి ఆచూకీ' చెప్పుమని దీనంగా అడిగినా ఎవరూ పట్టించుకోవట్లేదని.. వారి పిల్లలు ఏకంగా 'తెలంగాణ మహిళా కమిషన్' కార్యాలయం మెట్లెక్కారు. మహిళా కమిషన్ శరణుజొచ్చిన పిల్లలు తమ తల్లిని వెతికిపెట్టి.. మా అమ్మా-నాన్నతో మమ్మల్ని కలపండని ఒక విజ్ఞాపన పత్రం అందజేశారు. అందులో తమ అందమైన కుటుంబంలో 'రమణ' అనే విలన్.. చొరబడి చిన్నాభిన్నం చేసి.. మా అమ్మను తీసుకెళ్లిపోయాడని విలపించారు. ఎలాగైనా 'మా-అమ్మ'ను మాకు అప్పగించమని వేడుకున్న వైనం హృదయాలను ద్రవింపజేసింది.!

